

రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నిత్యాన్నదాన భవన నిర్మాణానికి కామిశెట్టి నరేష్‌బాబు, రమ్యశ్రీ దంపతులు (బొమ్మూరు) రూ.1,01,116 విరాళం సమర్పించారు.



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం తూర్పు డెల్టాకు 4,900, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 7,500 క్యూసెక్కుల నీరు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.30 అడుగులకు చేరింది.

అన్నదాన విరాళం



ద్వారకా తిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు మోటుపల్లి రాజు (ఆకివీడు మండలం కుప్పనపూడి) మంగళవారం రూ.1,11,011 విరాళం సమర్పించారు.

న్యూస్‌రీల్

గోదావరిపై త్వరలో ఐకానిక్ వంతెన



రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో అఖండ గోదావరిపై రాజమహేంద్రవరంలో మరో నూతన వంతెన నిర్మించనున్నట్టు ఎంపీ భరత్ రామ్ వెల్లడించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకలలో విలేకరులతో మాట్లాడారు. రాజమహేంద్రవరం నగరానికే కాకుండా రాష్ట్రంలోనే ప్రత్యేకంగా కొత్త వంతెన డిజైన్ ఉండబోతోందన్నారు. విశాఖ – విజయవాడ మధ్య థర్డ్ లైన్ రానుందని, ఇప్పటికే విజయవాడ – గుంటూరు మధ్య థర్డ్ లైన్ పనులు జరుగుతున్నాయని చెప్పారు. మూడేళ్లుగా థర్డ్ లైన్, నూతన వంతెన ప్రతిపాదనలు రైల్వే శాఖకు పంపిస్తూనే ఉన్నామని, మొన్ననే రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసినట్టు తెలిపారు. రైల్వే బోర్డు విశాఖ – విజయవాడ థర్డ్ లైన్ ప్రతిపాదన క్లియర్ చేయడమే కాకుండా, నూతన బ్రిడ్జి ప్రతిపాదన కూడా ఆమోదించినట్లు వార్తలొచ్చాయన్నారు. ఫోర్త్ లైన్ ప్రతిపాదన కూడా రైల్వే బోర్డు సమావేశంలో చర్చకు వచ్చినట్టు తెలిసిందన్నారు. అయితే గోదావరిపై ఐదో వంతెన ఎక్కడ నిర్మించాలన్న అంశంపై కూడా తాను రైల్వే శాఖ మంత్రికి వివరించానన్నారు. రోడ్డు కం రైల్వే వంతెన అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు.

జేఎన్‌టీయూకేలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకేలో త్వరలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి చర్యలు తీసుకుంటామని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. వర్సిటీ ఆవరణలో మంగళవారం 77వ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ఎన్‌సీసీ వలంటీర్ల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ ఏడాది బీటెక్‌లో సీఎస్‌ఈ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ మెషిన్ లెర్నింగ్ కోర్సులతో పాటు ఎంఎస్సీ డేటా సైన్స్,ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు ప్రారంభించామన్నారు. ప్రపంచ స్థాయి విద్యాబోధనకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులను ఆయన సత్కరించారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ,రిజిస్ట్రార్ సుమలత,స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

సాయుధ దళాల పతాక నిధికి విరాళం



జిల్లా సైనిక సంక్షేమ అధికారి కెప్టెన్ సత్యప్రసాద్‌కు చెక్కు అందజేత

కాకినాడ సిటీ: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పరిధిలోని జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సాయుధ దళాల పతాక నిధికి రూ.18 లక్షల విరాళాన్ని మంగళవారం స్వాతంత్ర్య వేడుకల్లో అందజేశారు. విరాళానికి సంబంధించిన మెగా చెక్కును జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు చేతుల మీదుగా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి జిల్లా సైనిక సంక్షేమ అధికారి కెప్టెన్ సత్యప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీ వంగా గీత, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, డీఆర్‌డీఏ పీడీ కె శ్రీరమణి, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళాలు

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న నిత్యాన్నదాన భవన నిర్మాణానికి పలువురు భక్తులు విరాళాలు సమర్పించారు. యు.రాజేంద్రప్రసాద్‌వర్మ, జానకి లక్ష్మి దంపతులు (విశాఖపట్నం) రూ.25 వేలు, ఎన్.శ్రీనివాస్, జ్యోతి దంపతులు (ఆలమూరు మండలం చింతలూరు) రూ.25 వేలు, ఎం.సత్యనారాయణ, ధనలక్ష్మి దంపతులు (వడలి) రూ.11,146, పి.జోగారావు, మణి దుర్గా భవాని దంపతులు (ఆత్రేయపురం) రూ.10,116, వి.శ్రీనివాసరెడ్డి, స్వాతి దంపతులు (పెనుమంట్ర మండలం వెలగలేరు) రూ.10,116, ఎ.శంకరరావు, శ్రీదేవి దంపతులు (సికింద్రాబాద్) రూ.10 వేల చొప్పున విరాళాలు సమర్పించారని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.



జెండా వందనం చేస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి వేణు, ఎంపీ భరత్ రామ్, కలెక్టర్ మాధవీలత



పావురాలు ఎగురవేస్తున్న మంత్రి వేణు, ఎంపీ భరత్ రామ్, కలెక్టర్ మాధవీలత, రుడా చైర్ పర్సన్ షర్మిలారెడ్డి



గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి వేణు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తదితరులు



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

సమష్టి కృషితో అగ్రపథం

- వార్షిక క్యాలెండర్ ప్రకారం నిబద్ధతతో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణు
- ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

సాక్షి, రాజమహేంద్రవరం: దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహనీయుల స్ఫూర్తితో జిల్లా అభివృద్ధికి పునరంకితం అవ్వాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసు బలగాల గౌరవ వందనం స్వీకరించారు. వివిధ ప్రభుత్వ పథకాలపై ఆయా శాఖలు రూపొందించిన శకటాల ప్రదర్శనను తిలకించారు. కలెక్టర్ కె.మాధవీలత, ఇన్‌చార్జి ఎస్పీ హోదాలో ఎం.రజనీ, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్, ఎంపీ మార్గాని భరత్ రామ్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా,రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులు, న్యాయమూర్తులు పాల్గొన్నారు

మంత్రి వేణు ఏమన్నారంటే..

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపేందుకు ప్రజాప్రతినిధులు, అధికారుల ప్రతి గడపా తడుతున్నారు. గ్రామాల్లో సమస్యలు గుర్తించి పరిష్కరిస్తున్నారు. ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో రూ.20 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఇప్పటి వరకూ రూ.48.48 కోట్ల అంచనాతో 1,332 పనులు మంజూరు చేయగా, 1234 పనులు పురోగతిలో ఉన్నాయి.

వ్యవ'సాయం'

రైతు సంక్షేమమే లక్ష్యంగా వ్యవసాయ రంగంలో అనేక సంస్కరణకు నాంది పలికాం. 58 వేల హెక్టార్ల వ్యవసాయ, అనుబంధ రంగాల్లో వివిధ పంటల సాగుకు ప్రోత్సాహం అందిస్తున్నాం. వైఎస్సార్ భరోసాతో ఏటా 1.35 లక్షల మంది రైతులకు రూ.102 కోట్లు నేరుగా వారి బ్యాంకుఖాతాలకే జమ చేస్తున్నాం. 70 వేల మందికి రూ.1,976 కోట్ల పంట రుణాలు, 27 వేల మందికి సున్నా వడ్డీ కింద రూ.5 కోట్ల రాయితీ, 286 గ్రూపులకు రూ.8.83 కోట్ల రాయితీతో వ్యవసాయ యంత్ర పరికరాలు, 15 వేల మంది రైతులకు రూ.11.17 కోట్ల పంటల బీమా, 12 రైతు ఉత్పత్తి సంస్థల ఏర్పాటు ద్వారా 227 మందికి రూ.5.56 కోట్ల లబ్ధి చేకూర్చాం. 367 రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, పురుగు మందులు అందిస్తున్నాం.

విద్యకు ప్రాధాన్యం

పేదలకు విద్య అందించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. అమ్మ ఒడి ద్వారా ఏటా 1.56 లక్షల మంది పిల్లల తల్లుల ఖాతాల్లో రూ.236 కోట్లు జమ చేస్తోంది. రూ.268 కోట్లతో 655 పాఠశాలల్లో నాడు– నేడు పథకంలో అభివృద్ధి పనులు చేపడుతోంది. ప్రతి మండల కేంద్రంలో ఇంటర్ జూనియర్ కళాశాల ఏర్పాటు దిశగా అడుగులేస్తోంది. జగనన్న విద్యా దీవెన కింద పేద విద్యార్థులకు రూ.23.25 కోట్లు ఆర్థిక సాయం అందించింది. వసతి దీవెనలో భాగంగా 32,000 మంది విద్యార్థులకు రూ.30.58 కోట్లు వారి తల్లుల ఖాతాలో జమ చేసింది.

ఆరోగ్యానికి అండలం

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం అమల్లోకి తీసుకొచ్చారు. 368 ప్రాంతాల్లో 68 వైద్యులతో కూడిన బృందం ఆధ్వర్యంలో 1.8 లక్షల మందికి వైద్య సేవలు అందించాం. ఆరోగ్యశ్రీ కింద 26,670 శస్త్రచికిత్సలకు రూ.52.39 కోట్లు వెచ్చించాం. రాజమహేంద్రవరంలో రూ.475 కోట్లతో వైద్యకళాశాల నిర్మాణం చేపడుతున్నాం. ఈ ఏడాది సెప్టెంబర్‌లో 150 మంది ఎంబీబీఎస్ విద్యార్థులతో తరగతులు ప్రారంభం కానున్నాయి.

మంత్రి వేణు ప్రసంగంలోని ముఖ్యాంశాలు

గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో ప్రజల గడప వద్దకే సంక్షేమ ఫలాలు అందిస్తున్నాం. నవరత్నాల్లో భాగంగా 99 శాతం లబ్ధిదారులకు పథకాలు అందించాం. మిగిలిన ఒక్క శాతం అర్హులను గుర్తించి లబ్ధి చేకూర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. జగనన్న సురక్ష ద్వారా 5,78,310 మందికి (99.9 శాతం) 11 రకాల ప్రభుత్వ సేవలు ఉచితంగా అందజేశాం.

- జిల్లాలో 66,500 ఎకరాల విస్తీర్ణంలో ఉద్యాన వన పంటలకు ప్రోత్సాహం, రూ.17 కోట్లతో 2,843 మంది రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లు, కడియంలోని జిల్లా మత్స్య విత్తన క్షేత్ర కేంద్రం ద్వారా ఈ ఏడాది 3.6 కోట్ల చేప పిల్లల ఉత్పత్తి చేశాం. డాక్టర్ వైఎస్సార్ పశు ఆరోగ్య సేవా సంచార వాహనం 1962 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఇప్పటి వరకు 14 వేల మంది రైతులకు చెందిన పశువులకు వైద్యసేవలు అందించాం.
- వైఎస్సార్ పింఛను కానుక కింద 16 కేటగిరిల్లో 2.33 లక్షల మందికి రూ.64.13 కోట్లు పంపిణీ చేశాం.
- వైఎస్సార్ చేయూతలో రూ.379.33 కోట్లు, ఆసరా పథకం కింద నాలుగు విడతలుగా 30,513 గ్రూపులకు రూ.820.50 కోట్ల ఆర్థిక సహాయాన్ని మహిళలకు అందించాం.
- చిరు వ్యాపారులకు జగనన్న తోడు పథకం కింద సున్నా వడ్డీ రుణాలుగా రూ.36.75 కోట్లు, చేదోడు పథకం లబ్ధిదారులకు రూ.13.50 కోట్లు జమ చేశాం.
- ఈబీసీ నేస్తం పథకం కింద 16,218 మంది మహిళలకు రూ.24.32 కోట్లు, వైఎస్సార్ కాపు నేస్తం పథకం 3వ విడతగా 29,824 మంది మహిళలకు రూ.44.73 కోట్లు, నేతన్న నేస్తంలో ఈ ఏడాది రూ.2.20 కోట్ల ఆర్థిక ఆసరా కల్పించాం.
- వైఎస్సార్ సున్నావడ్డీ కింద 36,816 స్వయం సహాయక సంఘాలకు రూ.53.81 కోట్ల రాయితీని అందజేశాం.
- మైనార్టీ సంక్షేమంలో భాగంగా జిల్లాలో 947 మంది మైనార్టీ విద్యార్థులకు జగనన్న విద్యా దీవెనలో రూ.1.88 కోట్లు, వసతి దీవెన కింద 953 మందికి రూ.1.48 కోట్లు, ఇమామ్, మౌజన్, చర్చి పాస్టర్లకు, అర్చకులకు గౌరవ వేతనం అందిస్తున్నాం.
- బ్యాంకు లింకేజీగా 36 వేల డ్వాక్రా గ్రూపులకు రూ.15,656 కోట్లు బ్యాంకు రుణాలు అందజేశాం.
- ఈ ఏడాది 120 కిలోమీటర్ల మేర రహదారుల మరమ్మతులకు రూ.60 కోట్లు వెచ్చించాం.
- గ్రామ స్వరాజ్య పాలన దిశగా రూ.150 కోట్లతో 390 గ్రామ సచివాలయ భవనాలు, రూ.81 కోట్లతో 372 రైతు భరోసా కేంద్ర భవనాలు, రూ.58 కోట్లతో 338 వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నిర్మాణాలు చేపడుతున్నామని వేణు వివరించారు.



ప్రసంగిస్తున్న మంత్రి వేణు

మెట్టలో పొగాకు సాగుకు శ్రీకారం

- ముమ్మరంగా కడుతున్న నారుమడులు
- అధిక దిగుబడులనిచ్చే వంగడాలపై మొగ్గు

దేవరపల్లి: మెట్ట ప్రాంతంలో పొగాకు సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది సీజన్ ప్రారంభమైయింది. పొగాకు బోర్డు ఉత్పత్తి కోట ఖరారు చేయడంతో నారుమడులు సిద్ధం చేస్తున్నారు. అధిక దిగుబడులు ఇచ్చే వండగాలను ఎంపిక చేసుకుంటున్నారు. ఎక్కువగా ఎల్‌వీ–7 వంగడాన్ని సాగు చేస్తున్నారు. దీనివల్ల ఎకరాకు సగటున 12 నుంచి 13 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు భావిస్తున్నారు. నారుమడులు కట్టడానికి వాతావరణం అనుకూలంగా ఉండడంతో దుక్కులు సిద్ధం చేసి విత్తనాలు వేస్తున్నారు. దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం వేలం కేంద్రాల పరిధిలో సుమారు 60 వేల ఎకరాల్లో పొగాకు సాగు చేస్తారు. రెండేళ్లుగా ధర ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఉత్సాహం చూపిస్తున్నారు. ఇందులో ఎక్కువ మంది కౌలు రైతులే. ఐదు వేలం కేంద్రాల పరిధిలో దాదాపు వెయ్యి మంది కౌలు రైతులు నారుమడులు కట్టి వ్యాపారం చేస్తున్నారు. ఎకరం నుంచి ఐదెకరాల్లో నారుమడులు వేస్తున్నారు. గత సీజన్‌లో ఎకరం నారు (6 వేల మొక్కలు) రూ.18 వేలు పలకడంతో కాసుల పంట పండింది. రూ.20లక్షల నుంచి 25 లక్షలు ఆదాయం పొందాడు. ఎకరం నారు రూ.5 వేలు పలికింది. పెట్టుబడుతు పోనూ కొద్దిపాటి లాభాలతో రైతులు గట్టెక్కారు. ఈ ఏడాది పొగాకు ధర క్వింటాలు గరిష్ఠంగా రూ.285 పలకడంతో నారుమడుల విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. ఎకరం కౌలు గతేడాది రూ.45 వేల ఉండగా, ఈ ఏడాది రూ.60 వేలు పలుకుతోంది. అయినా భూమి దొరకడం కష్టంగా ఉందని కౌలు రైతులంటున్నారు. పొగాకు బోర్డు, సీటీఆర్ఐ, ఐటీసీ సంస్థలు వంగడాలను రైతులకు సరఫరా చేస్తున్నారు.



దేవరపల్లి మండలం పల్లంట్లలో కట్టిన పొగాకు నారుమడులు

ట్రే నర్సరీల ఏర్పాటు

ట్రే నర్సరీలను ఎక్కువగా ఏర్పాటు చేస్తున్నారు. పొలాల్లో షేడ్‌నెట్ పందిళ్లు వేసి నారు పెంచుతున్నారు. ట్రే నారు నాణ్యతగా ఉండి, చీడపీడలను తట్టుకుంటుందని భావిస్తున్నారు. నారు ధర ఎక్కువగా ఉన్నప్పటికి రైతులు ట్రే నారు నాటుతున్నారు. పెద్ద రైతులు సొంతంగా ట్రే నారు పెంచి తోటలు వేస్తున్నారు. దేవరపల్లి మండలం పల్లంట్ల, బందపురం, లక్ష్మీపురం, గ్రామాల్లో సుమారు 100 ఎకరాల్లో నారుమడులు వేస్తున్నారు. ఇప్పుడు వేసిన నారుతో అక్టోబరులో నాట్లు వేస్తారు.

పంచాయతీలలో డిజిటల్ చెల్లింపులు



పంచాయతీలలో డిజిటల్‌విధానంలో నగదురహిత చెల్లింపులను ప్రారంభిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ,కలెక్టర్.డా.మాధవీలత

ప్రారంభించిన మంత్రి వేణు

రాజమహేంద్రవరం రూరల్: గ్రామీణ స్థాయి పంచాయతీ వ్యవస్థలో డిజిటల్ విధానం ద్వారా నగదు రహిత చెల్లింపులకు శ్రీకారం చుట్టినట్లు జిల్లా ఇంఛార్జి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాల్ కృష్ణ తెలిపారు. గ్రామ పంచాయతీలలో నగదు రహిత లావాదేవీల కార్యక్రమాన్ని మంగళవారం కలెక్టర్ డా.కె.మాధవీలతతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో జిల్లా పరిధిలోని 300 పంచాయతీలకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా క్యూ ఆర్ కోడ్ ఇచ్చామన్నారు. పంచాయతీకి పన్నులు, ఇతరత్రా చెల్లింపులను నగదు రహిత రూపంలో చెల్లించే వెసులుబాటు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఇకపై ప్రజల సౌకర్యార్థం యూపీఐ ఆధారిత చెల్లింపునకు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పీఓఎస్ పరికరం, క్యూ ఆర్ కోడ్ స్కానర్ పత్రాలను అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం ప్రసాద్, డీపీవో జేఎస్ సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నారా వారి నాన్చుడు పాలసీ



- నిండా మునుగుతున్న టీడీపీ
- ప్రతి నియోజకవర్గంలోనూ తలనొప్పులే
- రామచంద్రపురం, పి.గన్నవరాలకు తాత్కాలిక ఇన్‌చార్జితో సరి
- గాలిలో గొల్లపల్లి భవితవ్యం
- అమలాపురంలో వీధిన పడిన విభేదాలు
- మండపేటలో వ్యతిరేకత మూటగట్టుకుంటున్న వేగుళ్ల
- తలలు పట్టుకుంటున్న తమ్ముళ్లు
- నేటి నుంచి కోనసీమలో చంద్రబాబు మూడు రోజుల పర్యటన

సాక్షి, అమలాపురం: 'అట్టడుగు నుంచి సమాచారం తెప్పించుకుంటాను. మూడు నాలుగు సర్వేలు చేయిస్తాను. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, ఐవీఆర్ఎస్ సర్వే చేయించి, డేటా విశ్లేషణ చేయడం ద్వారా పార్టీ ఇన్‌చార్జిలను, అభ్యర్థులను నిర్ణయిస్తాను' ఇది టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తరచూ చెప్పే మాట. కానీ ఆయన మాటలకు చేతలకు పొంతన ఉండటం లేదు. అభ్యర్థులను నిర్ణయించడం అటుంచి కనీసం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలను సైతం ధైర్యంగా నియమించే స్థితిలో టీడీపీ అధినేత లేరు. ఆయన నాన్చుడు ధోరణి పార్టీ పుట్టి ముంచుతోందని తమ్ముళ్లు తలలు పట్టుకుంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో చంద్రబాబు బుధవారం నుంచి మూడు రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్నారు. తొలి రోజు మండపేట, గురువారం కొత్తపేట, శుక్రవారం అమలాపురంలో రచ్చబండ, రోడ్డు షోలు, బహిరంగ సభలు నిర్వహించనున్నారు. ఆవిర్భావం నుంచీ పలు ఎన్నికల్లో ఏకపక్ష విజయాలు సొంతం చేసుకున్న జిల్లాలో టీడీపీ ఎదురీతకు సంస్థాగత లోపాలు, ప్రజా విశ్వాసం కోల్పోవడం ప్రధాన కారణం కాగా.. పార్టీ అధినేత నాన్చుడు ధోరణి కూడా దీనికి తోడవుతోందని తమ్ముళ్లు అంటున్నారు.

అన్నిచోట్లా సమస్యలే..

- ఎన్నికల సమయం దగ్గర పడుతున్న తరుణంలో కూడా జిల్లాలోని ఇంచుమించు అన్ని నియోజకవర్గాల్లోనూ టీడీపీలో అంతర్గత కుమ్ములాటలు, అసంతృప్తులు, ఆధిపత్య పోరు కొనసాగుతూనే ఉన్నాయి. రామచంద్రపురం, పి.గన్నవరం నియోజకవర్గాలకైతే దిశానిర్దేశం చేసే నాయకులే లేరు. జిల్లా కేంద్రం అమలాపురంతో పాటు కొత్తపేటలో కూడా నాయకుల మధ్య ఆధిపత్య పోరు సాగుతోంది. ముమ్మిడివరం, రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జిల తలలపై పొత్తుల కత్తులు వేలాడుతున్నాయి.
- గత ఎన్నికల తరువాత నుంచి పి.గన్నవరం నియోజకవర్గంలో పార్టీని నడిపించే నాయకుడే లేకుండా పోయాడు. ప్రస్తుతం టూమెన్ కమిటీ పేరుతో అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జి గంటి హరీష్ మాధుర్, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు పని చేస్తున్నారు. గత ఎన్నికల్లో ఇక్కడి నుంచి నేలపూడి స్టాలిన్‌బాబు పోటీ చేశారు. ఎన్నికలు పూర్తి కాగానే ఆయన పార్టీని వీడారు. తరువాత ఇన్‌చార్జి కోసం పలువురు పేర్లు తెర మీదకు వచ్చినా చెప్పుకునే స్థాయి నాయకులు లేరు. గత్యంతరం లేని పరిస్థితుల్లో హరీష్‌కు అప్పగించారు. రాజకీయ అనుభవం లేకపోవడం.. అటు పార్లమెంటరీ నియోజకవర్గానికి, ఇటు అసెంబ్లీ నియోజకవర్గానికి తిరగాల్సి రావడంతో హరీష్ సైతం సమర్థంగా పని చేయడం లేదు. నామన చురుకుగా ఉండడం లేదు. నియోజకవర్గ ఇన్‌చార్జి నియామకాన్ని చంద్రబాబు నాలుగున్నరేళ్లుగా గాలికి వదిలేయడం క్యాడర్‌ను నిరుత్సాహానికి గురి చేస్తోంది.
- మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పరిస్థితి మరీ దారుణం. పార్టీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నా వచ్చే ఎన్నికల్లో ఆయనకు ఇక్కడి నుంచి టిక్కెట్ దక్కుతుందనే భరోసా లేదు. జనసేనతో పొత్తు ఉంటే రాజోలును ఆ పార్టీకి కేటాయిస్తారని, గొల్లపల్లికి పి.గన్నవరంలో అవకాశం కల్పిస్తారని తొలుత ప్రచారం జరిగింది. కానీ, ఇప్పుడు పి.గన్నవరం ఊసు కూడా లేదు. ఆయన నాయకత్వంపై పార్టీ అధిష్టానానికి నమ్మకం లేదని చెబుతున్నారు. 2014లో సైతం ఆయనకు టీడీపీ అన్యాయమే చేసింది. ఆ ఎన్నికలకు ఏడాది కన్నా ముందే గొల్లపల్లిని అమలాపురం ఎంపీ అభ్యర్థిగా చంద్రబాబు ప్రకటించారు. తీరా ఎన్నికలు వచ్చేసరికి మొండిచేయి చూపించారు.
- ముమ్మిడివరంలో మాజీ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు(బుచ్చిబాబు)దీ ఇదే పరిస్థితి. పార్టీ టిక్కెట్‌కు మరొకరితో పోటీ లేకున్నా జనసేనతో పొత్తు రూపంలో ఆయనపై కూడా కత్తి వేలాడుతోంది.
- అమలాపురంలో పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఇక్కడి నుంచి టిక్కెట్ ఆశిస్తున్న పరమట శ్యామ్ మధ్య విభేదాలు రోడ్డున పడుతున్నాయి. శ్యామ్ వెనుక ఇదే నియోజకవర్గానికి చెందిన పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప వర్గీయులు మద్దతుగా నిలుస్తున్నారు. వీరిద్దరిలో అభ్యర్థి ఎవరనే సందిగ్ధత పార్టీ క్యాడర్‌లో నెలకొని ఉంది. దీనికి తెర దించాల్సిన చంద్రబాబు ఇద్దరినీ పని చేయండని ప్రోత్సహిస్తున్నారు.
- రామచంద్రపురం నియోజకవర్గంలో కూడా ఇదే పరిస్థితి. ఇక్కడ నుంచి గతంలో ప్రాతినిధ్యం వహించిన ప్రస్తుత ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆ పార్టీని వీడిన తర్వాత స్థానికంగా నాయకత్వం లేకుండా పోయింది. శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యాన్ని ఇన్‌చార్జిగా నియమించినా ఆయన ఆ నియోజకవర్గాన్ని పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇక్కడ కూడా పార్టీని నడిపించేందుకు సరైన నాయకుడు లేకుండా పోయాడు.
- కొత్తపేటలో మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు టిక్కెట్ పరంగా పోటీ లేకున్నా ఇదే నియోజకవర్గానికి చెందిన రెడ్డి సుబ్రహ్మణ్యంతో ఆధిపత్య పోరు నడుస్తోంది.
- జిల్లాలో టీడీపీ గెలిచిన ఏకైక నియోజకవర్గం మండపేటలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రజా వ్యతిరేకత మూటగట్టుకున్నారు. ఇటు ఇంట, అటు బయట విమర్శల పాలవుతున్నారు. సుదీర్ఘ కాలం ఎమ్మెల్యేగా ఉండటంతో సహజంగానే క్యాడర్‌తో పాటు నియోజకవర్గంలోని పలువురిలో అసంతృప్తి నెలకొంది. ఇటీవల సొంత సామాజికవర్గానికి చెందిన నాయకులు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారంటే వేగుళ్ల మీద సొంత వారిలో ఎంత అసంతృప్తి ఉందో అర్థం చేసుకోవచ్చు.

క్లుప్తంగా

సీనియర్ సిటిజన్లకు డిపాజిట్లపై అదనపు వడ్డీ



కొత్త డిపాజిట్ పథకం బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): డీసీసీబీలో సీనియర్ సిటిజన్లు డిపాజిట్ చేస్తే అదనపు వడ్డీ ఇవ్వనున్నట్లు చైర్మన్ ఆకుల వీర్రాజు తెలిపారు. డీసీసీబీ కార్యాలయంలో కొత్తగా ప్రవేశపెట్టిన గౌతమి రికరింగ్ డిపాజిట్ పథకం, రైతునేస్తం రుణ పథకం బ్యానర్‌ను ఆయన మంగళవారం ఆవిష్కరించారు. గౌతమి రికరింగ్ డిపాజిట్ పథకంలో ఇతరులకు 7.60 శాతం, సీనియర్ సిటిజన్లకు 8.10 శాతం వడ్డీ రేటు ఇవ్వనున్నామని చెప్పారు. ఈ పథకం సెప్టెంబర్ 9వ తేదీ వరకూ మాత్రమే ఉంటుందన్నారు. రైతునేస్తం పథకం ద్వారా ఎకరా భూమి ఉన్న రైతుకు రూ.8 లక్షల రుణం ఇస్తామన్నారు. ఒక రైతుకు గరిష్టంగా రూ.36 లక్షల వరకూ రుణం ఇస్తామని చెప్పారు. దీనిపై వడ్డీ 12 శాతం మాత్రమేనన్నారు. రైతులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వీర్రాజు కోరారు.

శతాధిక వృద్ధుడి మృతి



కట్టా కృష్ణమూర్తి (పాతచిత్రం)

ముమ్మిడివరం: పట్టణ శివారు అగ్రహారానికి చెందిన శతాధిక వృద్ధుడు కట్టా కృష్ణమూర్తి (101) వృద్ధాప్యంతో మంగళవారం మృతి చెందాడు. ఆయనకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు, 15 మంది మనవలు, మునిమనవలు ఉన్నారు.

కట్నకానుకల చదివింపు పునరుద్ధరణ

అన్నవరం: నిత్య కల్యాణంలో సత్యదేవునికి, అమ్మవారికి భక్తులు సమర్పించే కట్న కానుకలు చదివించే పద్ధతిని పునరుద్ధరించారు. నిత్య కల్యాణం అనంతరం స్వామి, అమ్మవార్లకు భక్తులు కట్న కానుకలు సమర్పించడం చాలా కాలం నుంచే ఉంది. దీనిని ఇటీవల కొంత కాలంగా నిలిపివేశారు. ఈ విషయం తెలుసుకున్న ఈఓ చంద్రశేఖర్ ఆజాద్. స్వామివారి కల్యాణం అనంతరం భక్తుల కట్న కానుకలు స్వీకరించి, రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. దీంతో భక్తులు సమర్పించిన కట్న కానుకలను పండితులు రికార్డుల్లో నమోదు చేయడంతో పాటు మైకులో ప్రకటిస్తున్నారు. ఆది, సోమవారాల్లో రూ.1,538, రూ.1,618 కట్న కానుకల రూపంలో వచ్చినట్టు జమ చేశారు. సోమవారం రూ.1,118 కట్న కానుకలు సమర్పించినట్లు వేద పండితులు యనమండ్ర శర్మ, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు మైకులో ప్రకటించారు. స్వామి, అమ్మవారికి భక్తులు సమర్పిస్తున్న వస్త్రాలను కూడా రికార్డుల్లో నమోదు చేస్తున్నారు.

గోదావరి తీరానికి మువ్వన్నెల హారం

- వైభవంగా స్వాతంత్య్ర దినోత్సవం
- ఆర్ట్స్ కళాశాలలో వేడుకలు
- మంత్రి వేణు, కలెక్టర్ మాధవీలత వందన స్వీకారం
- ఆకట్టుకున్న సంక్షేమ పథకాల శకటాలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): గోదావరి తీరం మువ్వన్నెల రంగులతో మురిసింది. రహదారులన్నీ జాతీయ జెండాలతో నిండిపోయాయి. ఎటు చూసినా, ఎక్కడ చూసినా చిన్నారులు, యువకులు, మహిళలు, వృద్ధులు అనే భేదం లేకుండా జాతీయ జెండా చేబూని వందేమాతరం నినాదాలు చేస్తూ హోరెత్తించారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. శాంతి కపోతాలను, మూడు రంగుల బెలూన్లను మంత్రి వేణు, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, కలెక్టర్ కె.మాధవీలత, ఎగురవేశారు. శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అవార్డుల అనంతరం వందన సమర్పణ చేశారు. జాతీయ పతాకావిష్కరణ అనంతరం మంత్రి వేణు, కలెక్టర్ మాధవీలత, ఇన్‌చార్జి ఎస్పీ హోదాలో ఎం.రజని జీపులో ప్రాంగణమంతా తిరిగి పోలీసు వందనం స్వీకరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, పలువురు న్యాయమూర్తులు, స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబ సభ్యులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

టిడ్కో శకటానికి ప్రథమ స్థానం

రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన శకటాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. జిల్లా ప్రగతిని ప్రతిబింబించేలా 8 శాఖలకు చెందిన శకటాలను ప్రదర్శించారు. టిడ్కో, వ్యవసాయం, ఐసీడీఎస్ శకటాలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. అలాగే మహిళా ఆర్థిక అభివృద్ధి, ఐసీడీఎస్ – బంగారుకొండ, విద్య, గ్రామీణ నీటిసరఫరా, రెవెన్యూ – ప్రగతి పథం శకటాలు ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అలరించాయి. దేశభక్తి గీతాలకు చిన్నారులు ఉత్సాహంగా నృత్యం చేశారు. ఈ సందర్భంగా స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబాలను సత్కరించారు.



మంత్రి నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న నగరపాలకసంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్, జేసీ ఎస్.తేజ్‌భరత్, డీఆర్ఓ జి.నరసింహులు, రాజమహేంద్రవరం ఆర్డీఓ చైత్రవర్షిణి, కొవ్వూరు ఆర్డీఓ మల్లిబాబు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, ఈపీడీసీఎల్ ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి, జిల్లా ప్రజారవాణాధికారి కె.షర్మిలా అశోక్, డీపీఓ జేవీఎస్ సత్యనారాయణ, డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ సిరిపురపు సుభాషిణి, డ్వామా పీడీ పి.జగదాంబ, డీపీఆర్ఓ సీహెచ్ శ్రీనివాస్, జిల్లా హౌసింగ్ అధికారి జి.పరశురామ్, డీఈఓ ఎస్.అబ్రహం



అవార్డుల ప్రదానం

స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా అధికారులకు ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ బెస్ట్ ఎంప్లాయి అవార్డులు అందజేశారు. వాటిని అందుకున్న వారిలో రాజమహేంద్రవరం కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, ప్రత్యేక కలెక్టర్ ఎస్.సరళ వందనం, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (రాజమహేంద్రవరం) ఎ.చైత్రవర్షిణి, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (కొవ్వూరు) ఎస్. మల్లిబాబు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు డీఎం రాజు, జీఎస్ఎస్‌వీఎస్.శ్రీనివాస్, కె.గీతాంజలి, రాహుల్ (జైళ్ల సూపరింటెండెంట్), ఆర్.డేవిడ్ కుమార్ స్వామి (ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్), డాక్టర్ ఎం.సనత్ కుమారి (వైద్యం –ఆరోగ్యం), పి.విజయ భాస్కర్ (జిల్లా పౌరసరఫరాల అధికారి), జె.సత్యనారాయణ (జిల్లా పంచాయతీ అధికారి), కె.వెంకటేశ్వరరా రావు (జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి), డాక్టర్ పి.ప్రియాంక (జిల్లా కోఆర్డినేటర్ ఆరోగ్యశ్రీ), సుభాషిణి (పీడీ డీఆర్‌డీఏ), పి.వీణాదేవి (డీఎల్‌డీఓ), జగదాంబ (పీడీ డ్వామా), వి.సోమరాజు (ఎండోర్మెంట్ అధికారి), సీహెచ్ మార్టిన్ లూథర్ కింగ్ (అగ్నిమాపక), కృష్ణ భాస్కర్ (చేనేత టెక్స్‌టైల్), ఎ.పరశురామ్ (జిల్లా ప్రధాన గృహ నిర్మాణ అధికారి), సీహెచ్ శ్రీనివాస్ (డీఐపీఆర్వో), ఐ.కాశయ్య (డీపీఆర్ఓ), డీవీ ప్రసాద్ (లీడ్ బ్యాంక్ మేనేజర్) , ఎం.సుబ్రహ్మణ్యం (గనులు, జియాలజీ అధికారి), ఎ.ముఖలింగం (జిల్లా ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్ ఆఫీసర్), ఎస్‌బీవీరెడ్డి (ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారి), కె.ఆనందరావు (జిల్లా రిజిస్ట్రార్, స్టాంపులు), బి.బాలస్వామి (రుడా వైస్ చైర్‌పర్సన్), డి.బాల శంకరరావు(ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి), ఎం.సందీప్ (జిల్లా ఎస్సీ సంక్షేమం, సాధికారత), ఎస్.అబ్రహం (జిల్లా విద్యాశాఖాధికారి), కేఎన్ జ్యోతి (ఎస్టీ సంక్షేమం సాధికారత), పి.లక్ష్మణరావు (సర్వే, ల్యాండ్ రికార్డ్స్), ఎన్.సత్యనారాయణ (ట్రెజరీ, అకౌంట్స్) ,కేఎస్ఎంవీ కృష్ణారావు(రవాణా అధికారి), ఏబీవీ ప్రసాద్ (ఇంజినీరింగ్), జి.శ్రీనివాసరావు (నీటిపారుదల శాఖ ఎస్ఈ), కె.విజయ కుమారి (మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమం,సాధికారత), బి.శ్రీకాంత్(మున్సిపల్ కమిషనర్) ఉన్నారు.

మువ్వన్నెల పతాకమా..
అందుకో నా వందనం



జాతీయ పతాకానికి నేతాజీ సెల్యూట్



ఫొటో తీసిన ట్యాంకు శ్రీను

దేశ స్వాతంత్య్రోద్యమ నేతల్లోని అగ్రగణ్యుల్లో ఒకరు.. ఆజాద్ హింద్ ఫౌజ్ దళపతి.. నేతాజీ సుభాష్‌చంద్రబోస్. ద్రాక్షారామ ప్రధాన రహదారిపై ఆయన విగ్రహం సైనిక దుస్తుల్లో ఠీవీగా సెల్యూట్ చేస్తూ నిలబడి ఉంటుంది. బోసు బొమ్మ సెంటర్‌గా పేరొందిన ఆ ప్రాంతంలో నేతాజీ విగ్రహం ఎదురుగా ద్రాక్షారామ పంచాయతీ కార్యాలయం ఆధ్వర్యాన మంగళవారం జాతీయ జెండా ఎగురవేశారు. ఆ జెండాకు నేతాజీ సెల్యూట్ చేస్తున్నట్టుగా విగ్రహం వెనుక నుంచి పంచాయతీలో ట్యాంక్ వాచర్‌గా పని చేస్తున్న ఆకుల శ్రీనివాసరావు (ట్యాంకు శ్రీను) ఫొటో తీశారు. ఇది మంగళవారం బాగా వైరల్ అయ్యింది. ఈ ఫొటోను పలువురు తమ వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకున్నారు.

– రామచంద్రపురం రూరల్



కాట్రేనికోన మండలం కుండలేశ్వరంలో జాతీ య పతాక, మువ్వన్నెల పూల అలంకరణలో కుండలేశ్వరస్వామి



అమలాపురం గోఖలే సెంటర్‌లోని కనకదుర్గ ఆలయంలో జాతీయ జెండా రంగుల్లోని వస్త్రాలతో దర్శనమిస్తున్న అమ్మవారు



అమలాపురం శ్రీదేవి అమ్మవారి ఆలయంలో స్వాతంత్య్ర స్ఫూర్తిని నింపేలా త్రివర్ణ పతకాల అలంకరణ

భారత్‌మాతా కీ జై

తెల్లవారి దాస్య శృంఖలాలను తెంచుకుని.. భరత భూమి స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్న అపురూప సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ.. అమర వీరుల త్యాగ నిరతిని స్మరిస్తూ.. దేశ ఘనతను చాటి చెబుతూ.. స్వాతంత్య్ర దినోత్సవాన్ని మంగళవారం ఊరూవాడా ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. భారతదేశ సార్వభౌమత్వాన్ని చాటి చెప్పేలా.. మువ్వన్నెల పతాక నింగి వీధుల్లో సమున్నతంగా రెపరెపలాడింది. బడులు, గుడులు, ఇళ్లు, కార్యాలయాలు, వాహనాలు.. ఇలా ప్రతిచోటా త్రివర్ణ పతాకాలతో పలువురు సందడి చేశారు. భారీ జాతీయ పతాకాలతో ప్రదర్శనలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



యానాంలో జరిగిన వేడుకల్లో అలరించిన విద్యార్థినుల విన్యాసాలు



కాకినాడలోని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) వద్ద జాతీయ జెండాను ఎగుర వేస్తున్న చైర్మన్ ఆకుల వీర్రాజు



అమలాపురంలో వెయ్యి అడుగుల త్రివర్ణ పతాకంతో సర్ సీవీ రామన్ స్కూలు విద్యార్థుల ప్రదర్శన

అగ్నిప్రమాదంలో రూ.2 లక్షల ఆస్తి నష్టం

అంబాజీపేట: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గంగలకుర్రు పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. పంచాయతీ సిబ్బంది, స్థానికుల కథనం ప్రకారం.. పంచాయతీ కార్యాలయం గదిలో ఉంచిన బ్లీచింగ్, ముగ్గుల నుంచి మంటలు, పొగ రావడాన్ని పంచాయతీ సిబ్బంది గమనించి పెద్దగా కేకలు వేశారు. అప్రమత్తమైన స్థానికులు మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో గదిలో నిల్వ ఉంచిన రూ.75 వేల విలువైన బ్లీచింగ్, రూ.1.15 లక్షల విలువైన ముగ్గు, రూ.10 వేల విలువైన ఇతర వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. అమలాపురం అగ్నిమాపక అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు.

వ్రతం టిక్కెట్లపై పురోహితుల పారితోషికం ముద్రణ

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో వ్రత పురోహితులకు 40 శాతం కమీషన్ ఇస్తున్నట్టు వ్రతం టిక్కెట్టుపై ముద్రిస్తున్నారు. ఇప్పటి వరకూ వ్రత మండపాల్లో మాత్రమే ఈ విధమైన బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే వ్రత పురోహితులు కానుకలు డిమాండ్ చేస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పాటు భక్తుల ఫిర్యాదు మేరకు ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ రెండు వారాల వ్యవధిలో ఇద్దరు పురోహితులను సస్పెండ్ చేశారు. భక్తులను పురోహితులు కానుకలు డిమాండ్ చేయకుండా ఉండేందుకు గాను టిక్కెట్లపై వారికి ఇస్తున్న పారితోషకం మొత్తాన్ని ముద్రిస్తున్నారు.

సస్యరక్షణలో తగదు నిర్లక్ష్యం

- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న నిపుణులు
- మందుల పిచికారీలో అప్రమత్తత అవసరం

మండపేట: పురుగు మందుల పిచికారీలో అవగాహన లేమి వ్యవసాయ కూలీలు, రైతులను అస్వస్థతకు గురి చేస్తుంది. ఒక్కోసారి పరిస్థితి విషమించి ప్రాణాలను హరిస్తోంది. సస్యరక్షణ చర్యల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన పలువురు రైతులు మృత్యువాత పడగా మరెందరో అనారోగ్యాలకు గురయ్యారు. మందుల పిచికారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయాధికారులు ఇలా సూచిస్తున్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 5,42,000 ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగు చేస్తున్నారు. దాదాపు నాట్లు పూర్తి కాగా శివారు ప్రాంతాల్లో తుది దశలో ఉన్నాయి. ముందుగా నాట్లు వేసిన పొలాల్లో పంట తెగుళ్ల ఆశించకుండా రైతులు సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు. పురుగు మందుల వినియోగంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం రైతులకు ప్రాణాంతకమవుతుందని, పలు రోగాల బారిన పడే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పురుగు మందులు పిచికారీ చేస్తూ గతంలో వ్యవసాయ కూలీలు, రైతులు అనారోగ్యం పాలవడం, మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. మందుల దుష్ఫలితాలతో చాలామంది పలు దీర్ఘకాలిక రోగాలతోనూ బాధపడుతున్నారు.



పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతులు

ఈ జాగ్రత్తలు పాటించాలి

- ముందుగా పొలంలో పురుగుల తీవ్రతను అంచనా వేయాలి. పురుగుల సంఖ్య అధికంగా ఉండి పంటకు నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడుతున్నప్పుడు మందు పిచికారీ చేయాలి.
- మిత్ర పురుగులు తగిన సంఖ్యలో ఉన్నప్పుడు మందులు వాడాల్సిన అవసరం ఉండదు.
- పంటను ఆశించింది పురుగులా లేక తెగులా ముందుగా గుర్తించాలి. రైతులకు తెలియకపోతే దుబ్బులు లేదా మొక్కలను తీసుకువెళ్లి వ్యవసాయ అధికారులకు చూపించాలి.
- మందు డబ్బాలపై ఉండే సూచనలను రైతులు తప్పనిసరిగా గమనించి ఆ మేరకు జాగ్రత్తలు తీసుకోవాలి.
- వ్యవసాయ అధికారులు సిఫారసు చేసిన మందును నిర్ణీత మోతాదులో మాత్రమే వినియోగించాలి.
- పురుగు మందుతో కలుపు మందును కలిపి పిచికారీ చేయకూడదు.
- పిచికారీకి ఉపయోగించే స్ప్రేయర్లు, పరికరాలు సరిగా ఉన్నాయో లేదో చూసుకోవాలి. మందును బయటకు పంపే విధానం, ఎంత మందు ద్రావణం మొక్కలపై పడుతుందో ముందుగా గమనించాలి.
- సరిగా పనిచేయని, కారుతూ ఉండే స్ప్రేయర్లను వినియోగించకూడదు.
- పురుగు మందు డబ్బా మూతను నోటితో తీయకూడదు. మందు ద్రావణాన్ని చేతులతో కలపకూడదు.
- పవర్ స్ప్రేయర్ నాజిల్‌ను పెద్దదిగా చేయరాదు, పిచికారీ సన్నగా తుంపరలా పడేలా చూడాలి.
- చేతులకు గ్లౌజులు, ముక్కుకు మాస్క్, కళ్లజోడు తప్పనిసరిగా ధరించాలి.
- గాలి వాలుకు ఎదురుగా పిచికారీ చేయకూడదు.
- పైరు పెద్దగా ఉన్నప్పుడు చేతిపంపుతో పిచికారీ చేయకూడదు. పవర్ స్ప్రేయర్ వాడాలి.
- పిచికారీ చేసేటప్పుడు తినడం, తాగడం, పొగ తాగడం, కళ్లు నలుపుకోవడం, నోటిలో వేళ్లు పెట్టుకోవడం వంటివి చేయకూడదు.
- గాయాలైన చేతులతో మందులను తాకరాదు.
- పిచికారీ పూర్తయిన వెంటనే స్నానం చేయాలి.
- పిచికారీ చేసేందుకు ధరించిన దుస్తులను ఇతర దుస్తులతో కలిపి ఉతకరాదు.
- మందు డబ్బాలను చిన్నపిల్లలకు అందుబాటులో ఉంచకూడదు.
- ఖాళీ డబ్బాలను ఇంటి అవసరాలకు వాడకూడదు. వాటిని గొయ్యి తీసి పాతిపెట్టాలి.

జాగ్రత్తలు తీసుకోవాలి



అవసరం మేరకే రైతులు ఎరువులు, పురుగు మందులు వినియోగించాలి. మొదటి 45 రోజులు పైరుకు ఏ నష్టం కలిగినా పూడ్చుకునే సామర్థ్యాన్ని మొక్క కలిగి ఉంటుంది. అవసరం లేకుండా పురుగు మందు పిచికారీ వలన మిత్ర పురుగులకు నష్టం కలుగుతుంది. వ్యవసాయాధికారుల సూచన మేరకు తగిన జాగ్రత్తలు తీసుకుని సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

– కె.ఏసుబాబు, వ్యవసాయాధికారి, మండపేట